క్లుప్తంగా

19 నుంచి పళ్లాలమ్మ జాతర



మామిడికుదురు: లూటుకుర్రు బోనం మెరకలో కొలువు దీరిన గ్రామ దేవత శ్రీపళ్లాలమ్మ జాతర మహోత్సవాలు ఈ నెల 19వ తేదీ ఆదివారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ గురువారం తెలిపింది. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం మహిళలచే సామూహిక 108 కలశ పూజ, సామూహిక లక్ష కుంకుమార్చనలు, వివిధ పుష్ప, ఫలార్చనలు, విశేష మహా నివేదనలు ఉంటాయన్నారు. గణపతి, మహా కాళీ, మహాలక్ష్మి, మహా సరస్వతి, ఆదిమూల శాంతి హోమాలు, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. అదే రోజు ఆలయం వద్ద భారీ అన్న సమారాధన ఉంటుందని చెప్పారు. రాత్రి అమ్మవారి జాతర మహోత్సవం జరుగుతుందన్నారు. దీపిపి పురస్కరించుకుని పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

వెంకన్న కల్యాణం రేపు

అంబాజీపేట: అంబాజీపేట కొర్లపాటి వారిపాలెంలో వేంచేసి ఉన్న శ్రీ భూ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం శనివారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 20న స్వామి వారి తీర్థం, 17న అంకురార్పణ, ధ్వజారోహణ, 18న స్వామివారి కల్యాణం, 20న సదస్య వ్రతం, 23న చక్రస్నానం, 24న పుష్పోత్సవం నిర్వహించనున్నామన్నారు.

పంచాయతీ రికార్డుల తనిఖీ



తొత్తరమూడిలో పంచాయతీ రికార్డులను పరిశీలిస్తున్న డీఈఓ బొజ్జిరాజు

అయినవిల్లి: తొత్తరమూడి పంచాయతీ కార్యాలయాన్ని అమలాపురం డివిజనల్ పంచాయతీ అధికారి డి.బొజ్జిరాజు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయ సిబ్బంది హాజరు పట్టీ, మూమెంట్ రిజిస్టర్, కార్యాలయ రికార్డులను పరిశీలించారు. సచివాలయ, పంచాయతీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. విధి నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలను వివరించారు. పంచాయతీ కార్యదర్శి గరిమెళ్ల రవి తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదవాలి

మామిడికుదురు: ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు అన్నారు. ఏపీఆర్‌జేసీలో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించిన మామిడికుదురుకు చెందిన లిఖితపూడి హరిసత్య రామమోహన్‌ను గురువారం ఆయన శాలువాతో సత్కరించారు. రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించడం అభినందనీయమన్నారు. అనుకున్న లక్ష్యాన్ని సాధించే దిశగా ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు. ఆయన వెంట స్థానిక పెద్దలు యాలి శ్రీనివాస్, వాసంశెట్టి శంకరరావు, యింటి గణపతి, చుట్టుగుళ్ల కిశోర్, ఉండ్రు శ్రీరామారావు తదితరులు ఉన్నారు.

ఐరన్ సిరప్ అందజేత

ఆలమూరు: మండలంలోని వివిధ అంగన్‌వాడీ కేంద్రాలు, ఎంపీపీ పాఠశాలల్లో విద్యార్థులకు గురువారం ఐరన్ సిరప్స్ అందజేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎనిమియా ముక్తి భారత్ కార్యక్రమంలో భాగంగా చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.సువర్చలా దేవి, పి.భవానీశంకర్ ఆధ్వర్యంలో వైద్యారోగ్య సిబ్బంది స్థానిక అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి ఆరు నెలల నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులకు ఈ డ్రాప్స్‌ను అందజేశారు.

వేగానికి కళ్లెం వేయాలి

పి.గన్నవరం: ఇటీవల ఆధునీకరించిన రాజవరం- పొదలాడ రోడ్డులో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇక్కడ వాహనాల వేగానికి కళ్లెం వేయాలని బీఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. ఊడిమూడి గ్రామం వద్ద ఇటీవల ట్రాక్టర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన నలుగురు జట్టు కార్మికుల కుటుంబాలను గురువారం వారు పరామర్శించారు. మృతుల కుటుంబాలను ఆదుకుని, వారికి పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి కాండ్రేగుల నర్సింహులు, జిల్లా అధ్యక్షుడు కుసుమ వెంకటేశ్వరరావు, దాకే విద్యాసాగర్, నేలపూడి లెనిన్, ప్రసన్నకుమార్, కుసుమ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కేవీ సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్ కోర్సులలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ కోర్సులు ఇంగ్లిష్, తెలుగు మాధ్యమాలలో అందుబాటులో ఉన్నాయన్నారు. జూన్ 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం కానున్నట్లు సత్యనారాయణ తెలిపారు.

ముందుక్కు సాగుదామా..!

- వేసవి దుక్కులతో క్రిమికీటకాలు, తెగుళ్ల నివారణ
- పంట దిగుబడులకు అవకాశం

కొత్తపేట: సాగులో మెలకువలు పాటిస్తే.. సిరుల పంటే. సస్యరక్షణతో మంచి దిగుబడులే.. వేసవి కాలంలో పంట భూముల్లో దుక్కులు దున్నడం వల్ల అన్ని విధాలా మేలే. గతంలో అన్ని ప్రాంతాల్లోనూ వేసవిలో ముఖ్యంగా మండుటెండలు కాసే మే నెలలో దుక్కులు నాగళ్లతో దున్నేవారు. దీనివల్ల తెగుళ్ల సమస్య పెద్దగా ఉండేది కాదు. కాలక్రమేణా వేసవిలో కూడా పంట విరామం లేకుండా భూమిని ఖాళీగా పెట్టకుండా పంటలు పండించడంతో భూమి ఆరడం లేదు. ఈ నేపథ్యంలో క్రిమికీటకాలు నశించకుండా భూమిలోనే ఉండిపోయి మలి పంటపై దాడి చేస్తున్నాయి. అలా కాకుండా వేసవిలో కనీసం ఏప్రియల్ 15 నుంచి జూన్ 15 మధ్య పల్లం, మెరక అనే తేడా లేకుండా భూమిని ఖాళీగా పెట్టి వేసవి దుక్కులు దున్నటం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయ అధికారులు వివరిస్తున్నారు. కొత్తపేట నియోజకవర్గ పరిధిలోని కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 28,956 ఎకరాల్లో వరి సాగు జరుగుతోంది.



పంట భూమిలో ట్రాక్టర్‌తో వేసవి దుక్కు దున్నుతున్న రైతు

19,640 ఎకరాల్లో ఉద్యాన పంటల విస్తీర్ణం ఉంది.

ఇలా చేయడం మంచిది

భూమి పైభాగం ఆరిపోయినా లోపల భాగం తేమతో ఉంటుంది. అదే ట్రాక్టర్ ప్లావ్ నాగళ్లతో దుక్కులు దున్నడంతో నేల సుమారు రెండు అడుగులు మేర తిరగబడి లోపలి భాగంపైకి వస్తుంది. ఆ విధంగా లోపల పంటకు హాని చేసే పురుగులు బయటపడి నశిస్తాయి. ముఖ్యంగా పంటలో కాండం తొలుచు పురుగు, ఆకుముడత పురుగు, కాండం కుళ్లు తెగుళ్లకు కారకాలైన పురుగులు గుడ్లు పొదిగి నేలలో ఉంచడం వల్ల వచ్చే పంటలో మళ్లీ ఆ తెగులు వ్యాప్తి చెంది పంటను నాశనం చేస్తాయి. వేసవి దుక్కులు దున్నడంతో ఆ తెగులు జాతికి చెందిన బీజాలు బయటపడి వేడికి చనిపోవడం లేదా పక్షులు తినడంతో తెగుళ్ల వ్యాప్తి తగ్గుతుంది. లోపలి పోషకాలు పైకి రావడంతో పంటలకు దోహదపడతాయి. అలాగే మొండి జాతికి చెందిన గడ్డి మొక్కలు, కలుపు మొక్కల మూలాలు ఎండకు ఎండిపోయి వాటి సమస్య తగ్గడంతో పాటు దమ్ములో కుళ్లి నేల సారవంతమవుతుంది.

తెగుళ్లు తగ్గి.. నేల సారవంతం



వేసవి దుక్కులు దున్నడం వల్ల తెగుళ్ల వ్యాప్తి నివారించవచ్చు. పంటలో ఉన్న తెగుళ్ల బీజాలు నిర్మూలించవచ్చు. ఫలితంగా ఖర్చు తగ్గుతుంది. అంతేకాకుండా నేల కూడా సారవంతమవుతుంది. తద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చు. రైతులు అందరూ వేసవి దుక్కులు దున్నడం వల్ల మేలు చేకూరుతుంది. అధికారుల సూచనలు పాటిస్తూ వారు ముందుకు వెళ్లాలి.

–జి.పద్మలత, ఏఓ, కొత్తపేట

ఎత్తు పల్లాలు చదును

దుక్కులు దున్నడం, తద్వారా కలియపెట్టడం వల్ల భూమి ఎత్తు పల్లాలు సరిచేసుకోవడానికి అవకాశం ఉంటుంది. పల్లం, మెట్ట భూములకు నీరు పెట్టినప్పుడు, ఆ నీరు ద్వారా ఎరువులు సరఫరా చేసినప్పుడు పల్లంలోనే ఉండిపోకుండా చేనంతా సమాంతరంగా చేరేందుకు మొత్తం భూమంతా సమానంగా ఉండాలి. అందుకు వేసవి దుక్కులు దున్నినప్పుడు ఎత్తు పల్లాలు సరిచేసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచించారు.

వైద్యానికి రూ. 23 వేల సాయం



బాలుడి మావయ్యకు సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: అన్నవాహికలో లోపంతో పుట్టిన బాలుడి వైద్యానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు గురువారం రూ. 23 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కాట్రేనికోన మండలం పెనుమల్ల గ్రామానికి చెందిన చిటికెన శివప్రసాద్, శిరీషల కుమారుడు (3 నెలలు) పుట్టగానే అన్నవాహిక, ఊపిరితిత్తుల నాళం రెండు కలిసిపోయి తాగిన పాలు ఊపిరితిత్తుల్లోకి వెళ్లిపోతున్నాయి. ఇప్పటి వరకూ వైద్యులు ఐదు సార్లు శస్త్రచికిత్సలు చేశారు. వాటికి సుమారు రూ.3 లక్షల వరకూ ఖర్చు అయ్యింది. ఇంకా వైద్యం చేయించాల్సి ఉండడంతో తల్లిదండ్రులు స్థానిక కాశీ అన్నపూర్ణదేవి సేవా సంస్థను సహాయం కోరారు. రావులపాలెంలో బాబు మావయ్య విజయకుమార్‌కి సేవా సంస్థ సభ్యులు రూ.23 వేలను ఆర్థిక సాయంగా అందజేశారు.

రాజోలులో విజయం మనదే..

మాజీ మంత్రి సూర్యారావు



మలికిపురంలో కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: రాజోలు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ విజయం ఖాయమని మాజీ మంత్రి, రాజోలు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. గురువారం మలికిపురంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన మండల నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల వారీగా రిపోర్టులను పరిశీలించారు. పార్టీ విజయంపై శ్రేణులు ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సూర్యారావు మాట్లాడుతూ పార్టీ విజయం కోసం ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేశారని అన్నారు. వారందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. కార్యకర్తల కష్టం పార్టీ ఎప్పుడూ గుర్తుపెట్టుకుంటుందని అన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు అడబాల బ్రహ్మాజీరావు, సర్పంచ్ పెచ్చెట్టి నరసింహస్వామి, యల్లమిల్లి కృష్ణమూర్తి, కుడుపూడి తాతంబాబు తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో డెంగీ నివారణ



పుల్లేటికుర్రులో డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



పెదపళ్ల పీహెచ్‌సీ వద్ద ప్రదర్శన నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

అంబాజీపేట: చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా డెంగీ వ్యాధిని నివారించవచ్చని పీహెచ్‌సీ వైద్యాధికారి ఎ.ఇంద్రావతి అన్నారు. గురువారం ముక్కామల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పుల్లేటికుర్రులో డెంగీ వ్యాధి నివారణ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంద్రావతి మాట్లాడుతూ చిన్న దోమకాటుతో డెంగీ వ్యాధి వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. కొద్దిపాటి జ్వరం వస్తూ, తగ్గుతూ ఉన్నట్లయితే తక్షణమే ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. నివాస ప్రాంతాల్లో దోమలు చేరకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం మంచిదన్నారు. సర్పంచ్ జల్లి బాలరాజు, సీహెచ్‌ఓ రవికుమార్, సబ్ యూనిట్ అధికారి రాజబాబు, సూపర్‌వైజర్ రాధా నరసింహం, ఎంఎల్‌హెచ్‌పీ షైనా, హెల్త్ అసిస్టెంట్ ప్రసాద్, ఏఎన్‌ఎం ధనలక్ష్మి, ఆశా తదితరులు పాల్గొన్నారు.

డెంగీ నిర్మూలనకు కృషి చేద్దాం

ఆలమూరు: డెంగీ మహమ్మారిని నిర్మూలించేందుకు అంతా కృషి చేద్దామని కొత్తపేట అదనపు జిల్లా వైద్యాధికారి ఎం.సుమలత అన్నారు. చొప్పెల్ల, పెదపళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి, ఆర్.మల్లికార్జున్, డి.సాయికిశోర్ ఆధ్వర్యంలో మండలంలోని పీహెచ్‌సీల ఆవరణలతో పాటు ఆయా గ్రామ సచివాలయాల్లో జాతీయ డెంగీ వ్యాధి నివారణ దినోత్సవం జరిగింది. దోమలపై దండయాత్ర చేద్దాం- ఆరోగ్యంపై జైత్రయాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని వైద్యారోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు పి.శివప్రసాద్, ఎం.శ్రీనివాసరావు, పి.ఉమ, ఆర్.బాలామణి పాల్గొన్నారు.

అయినవిల్లి: డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అయినవిల్లి పీహెచ్‌సీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. డెంగీ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు పీహెచ్‌సీ వైద్యాధికారి బి.మంగాదేవి వివరించారు. పీహెచ్‌సీ సిబ్బంది జీఎస్ఎస్ రాంబాబు, డి.సీతారామమ్మ, పి.మోహర్‌వాణి, సీహెచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాజస్థాన్ పోలీసులకు సత్కారం



రాజస్థాన్ పోలీసు అధికారులను సత్కరిస్తున్న రూరల్ సీఐ వీరబాబు

అమలాపురం రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా శాంతి భద్రతల పరిరక్షణ కోసం అమలాపురం విచ్చేసి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సహకరించిన రాజస్థాన్ స్పెషల్ పోలీస్ బలగాల సేవలు ప్రశంసనీయమని అమలాపురం రూరల్ సీఐ వీరబాబు కొనియాడారు. గురువారం అమలాపురం తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ శేఖర్‌బాబు ఆధ్వర్యంలో రాజస్థాన్ పోలీసులను సత్కరించారు. ఈ సందర్భంగా సీఐ వీరబాబు మాట్లాడుతూ రాజస్థాన్ రాష్ట్రం నుంచి 86 మంది పోలీసులు ఎన్నికల విధులు నిర్వహించేందుకు అమలాపురం వచ్చారన్నారు. ఇందులో ఒక సీఐ, ముగ్గురు ఎస్ఐలు, 82 మంది పోలీసులు ఉన్నారన్నారు. వారంతా పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా విధులు నిర్వర్తించారని కొనియాడారు. కార్యక్రమంలో ఏఎస్ఐ ఏడుకొండలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చల్లచల్లని.. కూల్‌కూల్



అప్పనపల్లి బట్టీలో ఇటుకలపై కప్పిన బరకాలు



అంబాజీపేటలో కురుస్తున్న వర్షం

- వర్షంతో సేదతీరిన జనం
- ఇటుక బట్టీలకు నష్టం

మామిడికుదురు: వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజలకు ఉపరితల ఆవర్తనం ప్రభావంతో గురువారం కురిసిన అకాల వర్షం ఉపశమనం కలిగించింది. చల్లని గాలులతో కూడిన వర్షంతో ప్రజలు సేద తీరారు. మామిడికుదురు మండలంలో 28.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అకాల వర్షం కొందరికి మేలు చేయగా, మరికొందరికి నష్టం కలిగించింది. వేసవిలో కురిసిన వర్షం కొబ్బరి తోటలకు ఎంతో మేలు చేస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా పెదపట్నంలంక, అప్పనపల్లి, పాశర్లపూడి, బి.దొడ్డవరం, నగరం, గెద్దాడ, ఆదుర్రు తదితర గ్రామాల్లో ఇటుక బట్టీలకు ఈ వర్షం తీరని నష్టం కలిగించింది. పడుగుపై ఉన్న వేలాది ఇటుకలు అకాల వర్షానికి తడిసి ముద్దయ్యాయని బట్టీల నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు కొన్ని గ్రామాల్లో ధాన్యం కోత కోసి నూర్పిడి చేశారు. ధాన్యం కళ్లాల్లోనే రాశులుగా వేశారు. ధాన్యం రాశులు తడవకుండా బరకాలు కప్పారు. ధాన్యం రాశుల చుట్టూ వర్షం నీరు చేరిందని రైతులు ఆందోళన చెందారు. అప్పనపల్లి, మామిడికుదురు, పెదపట్నంలంక, పాశర్లపూడి, తదితర గ్రామాల్లో వర్షం నీరు రోడ్లపై భారీగా నిలిచిపోయింది. ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. మరో నాలుగు రోజుల పాటు వర్షాలు కొనసాగుతాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది.

వర్షంతో ఊరట

అంబాజీపేట: మండలంలో బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం ఉదయం వరకూ భారీ వర్షం కురిసింది. కొద్ది రోజులుగా ఎండలకు తాళలేక ఇబ్బంది పడిన జనానికి ఇది కాస్త ఊరట కలిగించింది. అకాల వర్షం కారణంగా జనజీవనం స్తంభించింది. మూడు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఉద్యాన పంటలకు, కూరగాయల సాగుకు, కొబ్బరి తోటలకు ఈ వర్షం ఉపయోగపడుతుందని రైతులు చెబుతున్నారు. మండలంలో వరి సాగు 85 శాతం పూర్తయిందని వ్యవసాయాధికారి సీహెచ్‌డీ విజయ్‌కుమార్ తెలిపారు. మిగిలిన 10 శాతం వరి కోతలు పూర్తయ్యాయి. కళ్లాల్లో ఉన్న ధాన్యం రాశులు వర్షానికి తడవకుండా రైతులు భద్రపరుచుకున్నారు.

అయినవిల్లి: అకాల వర్షానికి మండలంలోని పలుచోట్ల ధాన్యం రాశులు తడిసి ముద్దయ్యాయి. నేదునూరు, విలస, సిరిపల్లి, అయినవిల్లి, మడుపల్లి, మాగం, కె.జగన్నాథపురం తదితర గ్రామాల్లో సుమారు వెయ్యి ఎకరాల్లో వరి కోతలు జరగాలి. కొన్నిచోట్ల ధాన్యాన్ని కళ్లాలు, రోడ్లపై రాశులుగా ఉంచారు. అకాల వర్షానికి ఈ ధాన్యం రాసులు తడిసి ముద్దయ్యాయి.

ఆత్మీయ కలయిక.. ఆనంద డోలిక



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న 1997-98 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

అమలాపురం టౌన్: మండలంలోని మిరియాం ఉన్నత పాఠశాలకు చెందిన 1997-98 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు స్థానిక సత్యనారాయణ గార్డెన్స్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. జీవితంలో ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా సుమారు 25 ఏళ్ల తరువాత తాము చదువుకున్న పాఠశాలలో తిరిగి కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని ఆనంద డోలికల్లో తేలియాడారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు జాన్ పాల్ తదితరులను ఘనంగా సత్కరించుకున్నారు. మధ్యాహ్నం సహఫంక్తి భోజనాలు చేశారు.

104 వైద్య సేవలు

అంబాజీపేట: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న 104 వైద్య సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారులు సూచించారు. పుల్లేటికుర్రులో 104 వైద్య సేవలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

వేగం పుంజుకుంది

- వాడ్రేవుపల్లి డ్రెయిన్‌పై వంతెన నిర్మాణం
- రూ.1.01 కోట్లతో పనులు

మామిడికుదురు: అభివృద్ధి పనుల వేగం పుంజుకుంది.. ముంపునీటి సమస్యకు మోక్షం దిశగా అడుగు పడుతోంది.. 3 వేల ఎకరాల్లోని ముంపు నీరు గోదావరి నదిలోకి వెళ్లే వాడ్రేవుపల్లి మీడియం డ్రెయిన్‌పై ఆరు దశాబ్దాల కిందట నిర్మించిన కాజ్‌వే శిథిలస్థితికి చేరింది. దాని స్థానే పక్కా వంతెన నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. కేవలం నెల రోజుల వ్యవధిలోనే 70 శాతం పనులను పూర్తి చేశారు. వర్షాకాలానికి ముందుగానే పనులను పూర్తి చేయాలన్న కృత నిశ్చయంతో అధికారులు ఉన్నారు. పాశర్లపూడిలంక- లూటుకుర్రు గ్రామాల సరిహద్దులోని వాడ్రేవుపల్లి మీడియం డ్రెయిన్‌పై సుమారు 60 ఏళ్ల కిందట కాజ్‌వే నిర్మించారు. ఇది పూర్తిగా శిథిలమైంది. దీనిని తొలగించి అధునాతన తరహాలో వంతెన నిర్మిస్తున్నారు. వ్యవసాయ భూములకు ముంపు సమస్యను పూర్తిగా పరిష్కరించాలన్న లక్ష్యంతో కార్యాచరణ చేపట్టారు.

నిధులిచ్చి.. చొరవ చూపి..

కాజ్‌వే స్థానే వంతెన నిర్మాణానికి ప్రజాప్రతినిధులు, రైతుల డిమాండ్‌తో కలెక్టర్ హిమాన్షు శుక్లా డీఎంఎఫ్ ద్వారా రూ.41.60 లక్షలు మంజూరు చేశారు. అమలాపురం ఎంపీ చింతా అనురాధ ఎంపీ ఫండ్స్ నుంచి రూ.25 లక్షలు, జిల్లా పరిషత్ ద్వారా జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు రూ.35 లక్షలు వెరసి వంతెన నిర్మాణానికి రూ.1.01 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో వంతెన నిర్మాణం చేపట్టారు. శిథిలస్థితికి చేరిన కాజ్‌వేను తొలగించి దాని స్థానే నూతన కట్టడం నిర్మిస్తున్నారు. కాజ్‌వేకు రెండు వైపులా క్రాస్ బండ్లు ఏర్పాటు చేశారు. ఒకవైపు నుంచి ద్విచక్ర వాహనాలు వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.



వాడ్రేవుపల్లి మీడియం డ్రెయిన్‌పై వంతెన నిర్మాణ పనులు

సమస్యకు శాశ్వత పరిష్కారం



ఎంతో కాలం నుంచి అధ్వానంగా ఉన్న కాజ్‌వేకు మోక్షం లభించడం ఆనందంగా ఉంది. కాజ్‌వే పాడైపోవడంతో ముంపు నీరు సక్రమంగా పారుదల కాక చాలా కాలంగా రైతులు ముంపు సమస్యను ఎదుర్కొంటున్నారు. వంతెన నిర్మాణంతో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. ఆలస్యమైనా పక్కా వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టడం సంతోషకరం. వేలాది మంది రైతులకు ఈ వంతెన ఉపయోగపడుతుంది.

–బోణం శ్రీనివాసరావు, లూటుకుర్రు

ప్రజాప్రతినిధుల చొరవతో..



పాశర్లపూడిలంక- ఆదుర్రు రోడ్డు ఇటీవల ఆధునీకరణకు నోచుకుంది. దీనిని పక్కా సిమెంట్ కాంక్రీట్ రోడ్డుగా అభివృద్ధి చేశారు. పూర్వం నిర్మించిన కాజ్‌వే మాత్రం అభివృద్ధి చెందలేదన్న బాధ ఇంతకాలం ఉండేది. కలెక్టర్, ప్రజా ప్రతినిధుల చొరవతో మోక్షం కలిగింది. ఇక్కడ వంతెన నిర్మించడం హర్షణీయం. దీనిని ప్రతి ఒక్కరూ స్వాగతిస్తున్నారు. సకాలంలో పనులు పూర్తి చేయడం అభినందనీయం.

–వనిమిశెట్టి చలపతిరావు, లూటుకుర్రు

యుద్ధ ప్రాతిపదికన నిర్మాణం



యుద్ధ ప్రాతిపదికన బాక్స్ కల్వర్టు కమ్ బ్రిడ్జి నిర్మిస్తున్నాం. వాడ్రేవుపల్లి మీడియం డ్రెయిన్‌లో నిరంతరం నీటి ప్రవాహం ఉన్న ప్రాంతంలో క్రాస్ బండ్లు ఏర్పాటు చేసి డైవర్షన్ చానల్ ద్వారా నీటిని మళ్లించి నిర్మాణం చేపట్టాం. 40 టన్నుల భారీ క్రేన్, హాజిక్స్ సహాయంతో ఒక్క రోజులోనే ర్యాఫ్ట్ మొత్తం పూర్తి చేశాం. ఈఈ కె.చంటిబాబు ఆధ్వర్యంలో జేఈ బి.చిన్నంరాజు పర్యవేక్షణలో పనులు నిర్వహిస్తున్నాం.

–అన్యం రాంబాబు, పీఆర్ డీఈఈ ప్రాజెక్టు